

04


TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :74 ఆదివారం 14 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad




2



# సత్వర చర్యలు చేపట్టాలి

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

2

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.

## అసలు ఓట్లు తొలగించే కుట్ర :కెటిఆర్

రాజన్న సిరిసిల్ల,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):



తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.



- గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు
- నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్
- ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

పార్టీ కార్యాకర్తలు

## ప్రచారంలోకి దిగండి

చండీగఢ్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు.

2




## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

బిజెపి కుట్రలకు

## మీనాక్షి బలి

ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):



మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

## రైతుల సంక్షేమం లక్ష్యంగా కృషి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్గొండ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని... గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్ - 2026ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లా పేరు చెప్పగానే బత్తాయి తోటలు గుర్తుకు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించారు. గత నాలుగు దశాబ్దాలుగా వేలాదిమంది రైతుల జీవనాధారంగా బత్తాయి సాగు చేస్తున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. గతంలో స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం తనకు ఉందని వివరించారు. గత సంవత్సరం వరకు బత్తాయి రైతులకు ప్రత్యేకంగా ఓ వేదిక లేకపోవడం లోటుగా ఉండేదని అన్నారు. పుస్తకాల్లో ఉండే శాస్త్రీయ జ్ఞానం రైతుల పొలాల వరకు చేరినప్పుడే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు వస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.





## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

- 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు
- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

మంచిర్యాల,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు.

2



వీబీజీ రాంజీ స్కీం పట్ల

2

## ప్రభుత్వ నిరసన

కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క

పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

### సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్

### టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక

### యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ

### అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు

న్యూఢిల్లీ ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరపున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

### గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం

### మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి

మంచిర్యాల,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



# సత్వర చర్యలు చేపట్టాలి

### హైదరాబాద్‌లో భారీ వర్షం

### పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం

### అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి

### గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

### నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్

### ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

చండీగఢ్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు

# గుండెకాయ

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

### కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క

### పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హమీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

### ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తున్న కేంద్రం

## -సర్ పై బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి:

## -అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ ( హైదరాబాద్ మిర్రర్ )

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తోందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. శనివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సర్ పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని,ఇలాంటి తరుణంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుకూలురను, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే కుట్రలో భాగంనే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) చేపట్టిందని ఆయన ఆరోపించారు. సర్ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే పార్టీకి అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత బూత్ స్థాయి కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించి, కొత్తగా అర్హత పొందిన యువత పేర్లు నమోదు చేయించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు మానకొండూర్ నియోజకవర్గ సమన్వయకర్త, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అవగాహన కల్పించారు. సర్ లోని వివిధ అంశాలపై వివరిస్తూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అంతే కాకుండా బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సందేహాలను నరేందర్ రెడ్డి నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ కూన శ్రీశైలం గౌడ్, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం,మానకొండూర్, శంకరపట్నం మండలాల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, లింగాల శ్రీనివాస్, బొడ్డు సునిల్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి, పార్టీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, నందగిరి రవీంద్రచారి, ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్, కంది అశోక్ రెడ్డి, టి.రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, తొర్తి అరవింద్ తోపాటు పార్టీ జిల్లా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# షాదీ ముబారక్ పథకంలో భారీ మోసం

## : రూ. 21 లక్షల ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టిన ముఠా అరెస్ట్!

- నకిలీ పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడిన ఆరుగురు నిందితులు పట్టుబడ్డారు
- అత్తాపూర్ పోలీసుల మెరుపు దాడిలో దొరికిన ల్యాప్‌టాప్‌లు, నకిలీ దరఖాస్తులు
- నిందితుల్లో ఒక రెవెన్యూ అధికారి కూడా ఉన్నట్లు గుర్తింపు

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకమైన 'షాదీ ముబారక్'లో నకిలీ పత్రాలు సృష్టించి, ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించిన ఒక ముఠాను అత్తాపూర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులు నకిలీ లబ్ధిదారుల పేరుతో సుమారు రూ. 21 లక్షల మేర ప్రభుత్వ సొమ్మును మోసపూరితంగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయించుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్ నగర్ లోని ఫాతిమా కాలనీలో ఉన్న ఒక ఇంట్లో షాదీ ముబారక్ పథకానికి సంబంధించి నకిలీ పత్రాలు తయారు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ అనుమతితో, అత్తాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. జయరాజ్ తన సిబ్బంది మరియు పంచసాక్షులతో కలిసి మహమ్మద్ ఎతిమాద్ అనే వ్యక్తి నివాసంలో తక్షణ శోధన (సెర్చ్) నిర్వహించారు. ఈ దాడిలో నిందితుల వద్ద నుంచి ఒక అసూస్ ల్యాప్‌టాప్, హెచ్ పి, సి పి యూ డెస్క్‌టాప్ కంప్యూటర్, పలు మొబైల్ ఫోన్లు, షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన నకిలీ దరఖాస్తులు మరియు సుమారు 21 లక్షల విలువైన 21 విడుదలైన చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.?ముఠా ప్రధాన సూత్రధారి మహమ్మద్ ఎతిమాద్ (ఆధార్ ఆపరేటర్) పెయింట్ మరియు ఏదోబ్ ఫోటోషాప్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి వధువుల ఫోటోలు, ఐడీ వివరాలు, వివాహ ధృవపత్రాలను మార్చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించేవాడని విచారణలో తేలింది. మరో నిందితుడు మొహమ్మద్ అక్బర్ ఈ నకిలీ దరఖాస్తులను బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలోని స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ధరావత్ అశోక్ కిరణ్ ద్వారా ఎలాంటి ఫీల్డ్ వెరిఫికేషన్ (క్షేత్రస్థాయి పరిశీలన) లేకుండానే తదుపరి ప్రక్రియకు పంపేలా సహకరించాడు. మిగిలిన నిందితులు ముషరఫ్, సర్ఫరాజ్, జాఫర్ లు నకిలీ లబ్ధిదారులను ఎంపిక చేసి, వారి బ్యాంకు ఖాతాలు, విద్యుత్ బిల్లులు సేకరించడంలో తోడ్పడ్డారు. పోలీసులు ఈ కేసులో ఆరుగురిని అరెస్ట్ చేశారు:

ఎండీ . ఎతిమాద్ ఉల్ హక్ (25) – ఆధార్ ఆపరేటర్, సర్వశిక్షా అభియాన్ ఏజెంట్ (ప్రధాన నిందితుడు)
మొహమ్మద్ అక్బర్ (20) – డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ?సయ్యద్ ముషరఫ్ ఉద్దీన్ (23) – ఆన్‌లైన్ సర్వీసెస్ ౘ జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు
మహమ్మద్ సర్ఫరాజ్ (26) – జిరాక్స్ షాప్ వర్కర్
మహమ్మద్ జాఫర్ (23) – ప్రైవేట్ ఉద్యోగి
ధరావత్ అశోక్ కిరణ్ (32) – స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బండ్లగూడ తహసీల్.

?నిందితులపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు (సి ఆర్ .నెం .708/2026, యూ /ఎస్ 318(4), 319(2), 336(3), 340(2)ఆర్ /డబ్ల్యూ 3(5) బి ఎన్ ఎస్ ) నమోదు చేసి, వారిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది కల్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మకండి. ఇటువంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా నగదు వసూలుకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి అని అత్తాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె. నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి ముఠాను పట్టుకున్న పోలీసు బృందాన్ని రాజేంద్రనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ ) ఎస్. శ్రీనివాస్ మరియు అదనపు డీసీపీ కె. శ్రీనివాసరావు అభినందించి, సత్కరించారు.

# రూ. 2.43 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ శనివారం పలు కాలనీలలో విస్తృతంగా పర్యటించి, మొత్తం రూ. 2.43 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డివిజన్ 121 మరియు 123 పరిధిలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల బలోపేతానికి సంబంధించిన పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. తిరుమల గార్డెన్‌లో రూ. 44.00 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులు, పద్మశ్రీ హిల్స్‌లో రూ. 36.00 లక్షల వ్యయంతో యూ సి డి ౘ వీడీసీసీ రోడ్డు పనులు, నర్సారెడ్డి కాలనీలో రూ. 49.00 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులు, డాక్టర్స్ కాలనీలో రూ. 30.00 లక్షల వ్యయంతో యూ ఎస్ డి పనులు, అలాగే పి ౘ టి కాలనీ బి బ్లాక్‌లో రూ. 46.00 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. శివగంగ కాలనీలో రూ. 38.00 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలలో అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# క్రైమ్ మిర్రర్ కథనానికి స్పందించిన జలమండలి అధికారులు

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )


క్రైమ్ మిర్రర్
డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా స్పందించని అధికారులు



క్రైమ్ మిర్రర్ పత్రికలో ప్రచురితమైన "డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా స్పందించని అధికారులు" అనే కథనంపై జలమండలి అధికారులు స్పందించారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ అంగన్‌వాడీ సెంటర్ లైన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తీవ్రంగా పరిగణించినట్లు తెలిపారు.కథనం ప్రచురితమైన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, సమస్య ఉన్న ప్రాంతానికి సిబ్బందిని పంపించినట్లు వెల్లడించారు. డ్రైనేజీ లైన్లలో ఏర్పడిన అడ్డంకులను తొలగించి, మురుగునీటి ప్రవాహాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన క్రైమ్ మిర్రర్ పత్రికకు జలమండలి అధికారులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమని, పత్రికల్లో వచ్చిన కథనాలను సానుకూలంగా స్వీకరించి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# అధికారుల అలసత్వం : ముంపులోనే 'పత్తికుంట'..

ఈ ఏడాది కూడా వినాయక నిమజ్జనానికి తిప్పలే!

రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ వై. శ్రీధర్ ఆవేదన

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



మృగశిర కార్తి ప్రవేశంతో వర్షాలు ప్రారంభమవడం శుభసూచకమే అయినప్పటికీ, ఒక్క వర్షానికే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 'పత్తికుంట' చెరువు నీటితో నిండిపోవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా ఈ చెరువులో గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నా, అధికారులు కేవలం 'చూద్దాం.. చేద్దాం' అనే కాలయాపన ధోరణితోనే వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్ తదితర ఉన్నతాధికారులకు లేఖలు సమర్పించినప్పటికీ, శాశ్వత అభివృద్ధి పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ప్రతి సంవత్సరం నిమజ్జనం అనంతరం అభివృద్ధి చేపడతామని హామీలు లభించినా, వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి అవి మళ్లీ నిలిచిపోతున్నాయి.పత్తికుంట ప్రాంతం రాజేంద్రనగర్, మణికొండ, అత్తాపూర్, హైదర్‌గూడ, ఉప్పరపల్లి, మైలార్‌దేవుపల్లి, శంషాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి వంటి పరిసర ప్రాంతాల ప్రజలకు ముఖ్యమైన నిమజ్జన కేంద్రంగా ఉంది. ప్రతి సంవత్సరం భారీ సంఖ్యలో ప్రజలు కుటుంబాలతో సహా ఇక్కడికి వస్తుండటం గమనార్హం.గత 30 సంవత్సరాలుగా తాత్కాలిక ఏర్పాట్లతోనే నిమజ్జనం కొనసాగుతుండగా, శాశ్వత అభివృద్ధి లేకపోవడం వల్ల సమస్యలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఇటీవల టెండర్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ వర్క్ ఆర్డర్ జారీ కాకముందే వర్షాలు ప్రారంభమవడంతో ఈ సంవత్సరం కూడా పనులు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి.కావున సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పత్తికుంట అభివృద్ధి పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం కల్పించవలసిందిగా గణేశ్ ఉత్సవ సమితి తరపున కోరుచున్నాము.

## రేణిగుంటలో ఇసుక రీచ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

కరీంనగర్ ( హైదరాబాద్ మిర్రర్ )

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామంలో గనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇసుక రీచ్ ద్వారా స్థానిక యువతకు, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.రీచ్ నిర్వహించడం వల్ల గ్రామానికే కాకుండా రాష్ట్రానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు .ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా కార్యకలాపాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రామాభివృద్ధి, ప్రజల జీవనోపాధి మెరుగుదల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇసుక ట్రాక్టర్లు నడుపుకొని జీవనం సాగించే వారికి ఇదొక మంచి అవకాశమని, తాగి ట్రాక్టర్లు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన సూచించారు. మితిమీరిన వేగంతో ట్రాక్టర్ నడపకూడదని, అతివేగమే ప్రమాదాలకు హేతువు అని ఆయన గుర్తు చేశారు. ఇసుక ట్రాక్టర్లను పోలీసులు ఆపినప్పుడు వాటికి సంబంధించిన పత్రాలను చూపించాలని ఆయన చెప్పారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో రాళ్లగూడలో పేద కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )




రాళ్లగూడకు చెందిన గాయత్రి మిల్క్ సెంటర్ యజమాని రవి చినమ్మ చిర్ల బాబమ్మ గారి వైద్య చికిత్స నిమిత్తం రూ. 2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. పేదవారికి పెద్దన్నలా అండగా నిలుస్తూ ప్రజాసేవలో ముందుండే రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని అవసరమైన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి గోపాల్ యాదవ్ (మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్), దూడల వెంకటేష్ (మాజీ నర్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్), సీనియర్ నాయకులు చంద్రారెడ్డి , జెట్ట సీదులు , బంటీ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అవసర సమయంలో పేదలకు అండగా నిలవడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సాహితీ పురస్కారాల ప్రదానం

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం రోజున తెలుగు వెలుగు సాహితీ వేదిక పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి సన్మానించడం జరిగింది. వరంగల్‌లోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో, మణికొండ పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న మందువ ఫౌండేషన్ అధ్యక్షులు మందువ మధుసూదన్ శర్మ ని ప్రత్యేకంగా గుర్తించి సత్కరించారు. సాహితీ సేవా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు ఆయనకు కాలోజీ నారాయణరావు సాహితీ గౌరవ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మందువ మధుసూదన్ శర్మ గారు మాట్లాడుతూ తన సేవా కార్యక్రమాలను గుర్తించి పురస్కారం అందజేసిన తెలుగు వెలుగు సాహితీ వేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ఈ సత్కారాన్ని సార్థకం చేస్తానని ఆయన తెలిపారు.

## మహానేతల పేర్లతో ఉన్న పార్కుల దుస్థితి..

# ప్రజా ధనానికి ఇదేనా గౌరవం?

- పార్కులు అభివృద్ధి చేయలేని పాలకులు ప్రజలకు ఏం అభివృద్ధి చేస్తారు?
- బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )







ప్రజల ఆరోగ్యం, విశ్రాంతి, పిల్లల భవిష్యత్తు కోసం నిర్మించిన పార్కులు నేడు నిర్లక్ష్యానికి ప్రతీకలుగా మారడం అత్యంత బాధాకరం. దేశానికి దిశానిర్దేశం చేసిన మహానేతలు పి.వి. నరసింహారావు, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేర్లతో ఏర్పాటు చేసిన పార్కులు చెత్తకుప్పలుగా మారడం, పారిశుధ్యం లేక ప్రజలు అడుగుపెట్టలేని స్థితికి చేరుకోవడం అధికార యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది.మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలోని పలు పార్కులను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు అక్కడి పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా నిర్మాణ వ్యర్థాలు తొలగించకపోవడం, చిన్నారుల ఆట పరికరాలు పాడైపోవడం, మహిళలు, వృద్ధులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, చెత్త పేరుకుపోవడం, ప్రమాదకర విద్యుత్ తీగలు బహిరంగంగా ఉండటం వంటి అంశాలు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయని మండిపడ్డారు. ప్రజల కోసం నిర్మించిన పార్కులు నేడు సంఘవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాలుగా మారడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల ప్రజా ధనం ఖర్చు చేసినప్పటికీ ఫలితాలు కనిపించకపోవడం వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉందో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పార్కులు కేవలం చెట్లు, బెంచీలు కాదు... అవి సమాజ ఆరోగ్యానికి ఊపిరితిత్తులు. పిల్లల ఆటలు, యువత వ్యాయామం, వృద్ధుల విశ్రాంతి, మహిళల ఆరోగ్యకర జీవనానికి పార్కులు కేంద్ర బిందువులు. అలాంటి ప్రదేశాలు నిర్లక్ష్యానికి గురికావడం ప్రజల హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.మహానేతల పేర్లు పెట్టడం మాత్రమే కాదు, వారి ఆదర్శాలకు తగిన విధంగా ఆ ప్రదేశాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చోవడం మానేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించి పార్కులను ఆదర్శవంతమైన ప్రజా వనరులుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనం ప్రజల కోసమే... నిర్లక్ష్యం కోసం కాదు. పార్కులను కాపాడుకుందాం... భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిద్దాం అని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు.



# అత్యాశే మనిషికి శత్రువు!

## త్వరగా ధనవంతులు కావాలి , తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశే మోసగాళ్లకు బ్రహ్మాస్త్రం

## ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆర్థిక మోసాలు

## వివేకం కోల్పోతే జీవితాంతం కష్టపడి కూడబెట్టిన సంపద క్షణాల్లో మాయమవుతుంది

**హైదరాబాద్, జూన్ 13(హైదరాబాద్ మిర్రర్):**

ఒకప్పుడు దొంగలు అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి సంపదను దోచుకెళ్లేవారు. నేడు మోసగాళ్లకు ఆ అవసరం లేదు. ఒక మొబైల్ ఫోన్, ఒక ఆకర్షణీయమైన ప్రకటన, కొన్ని మాయమాటలు చాలు. మనమే వారి వలలో పడుతూ, మన కష్టార్జిత సంపదను వారి చేతుల్లో పెడుతున్నాం. ఇదే నేటి ఆర్థిక మోసాల చేదు వాస్తవం.తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పెట్టుబడి మోసాలు, మైక్రో ఫైనాన్స్ కుంభకోణాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, క్రిప్టో ఉచ్చులు, గోల్డ్ స్కీములు, మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో జరుగుతున్న ఆర్థిక నేరాలు వేలాది కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇటీవల వెలుగుచూసిన అనేక పెట్టుబడి స్కాంలు, మైక్రో ఫైనాన్స్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు ప్రజల జీవితకాల పొదుపులను కబళించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి.డబ్బు పోవడం మాత్రమే కాదు… దానితో పాటు మానసిక ప్రశాంతత, కుటుంబ ఆనందం, భవిష్యత్తుపై నమ్మకం కూడా కోల్పోతున్నారు. జీవితాంతం శ్రమించి కూడబెట్టిన సంపద కొన్ని రోజుల్లోనే ఆవిరైపోతోంది.

ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. సమాజంలో మోసగాళ్లు పెరుగుతున్నారా? లేక మోసపోయే వారి సంఖ్య పెరుగుతోందా? నిజానికి మోసగాళ్లు కొత్తవారు కాదు. యుగాలుగా ఉన్నవారే. మారింది వారి రూపం, పద్ధతి, సాంకేతికత మాత్రమే. కానీ వారి వలలో చిక్కుకునే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం ఒక్కటే: అత్యాశ.

### ఆశ అవసరం… అత్యాశ ప్రమాదం

ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. ఆశయం జీవితానికి దారి చూపుతుంది. కానీ శ్రమ లేకుండా, సమయం పట్టకుండా, తక్కువ కాలంలో అధిక లాభాలు పొందాలని కోరుకోవడం అత్యాశ. అదే మోసాలకు మొదటి మెట్టు.

“అధిక వడ్డీ”, “రెట్టింపు లాభాలు గ్యారెంటీ”, “రిస్క్ లేని పెట్టుబడి”, “ఇతరులు లక్షలు సంపాదిస్తున్నారు”, “మీ బంధువులు కూడా పెట్టారు” వంటి మాటలు వినగానే చాలా మంది ఆలోచనను పక్కనపెట్టి భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకుంటారు.

నిజానికి మోసగాళ్లు ముందుగా మన డబ్బును కాదు… మన ఆలోచనా విధానాన్ని దోచుకుంటారు.

వివేకం కంటే అత్యాశ బలంగా మారిన క్షణమే మోసం విజయవంతమవుతుంది.

### చదువుకున్నవారూ ఎందుకు మోసపోతున్నారు?

ఈ మోసాలకు బలవుతున్నవారిలో కేవలం అమాయకులు మాత్రమే లేరు. ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పదవీ విరమణ చేసినవారు, సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా ఉన్నారు.ఎందుకంటే మోసగాళ్లు మన తెలివితేటలను కాదు, మన బలహీనతలను లక్ష్యంగా చేసుకుంటారు. ఎక్కువ సంపాదించాలని కోరుకోని వ్యక్తి ఉండడు. ఆ కోరికనే వారు ఆయుధంగా మార్చుకుంటారు.

### సోషల్ మీడియా - మోసాలకు కొత్త వేదిక

ఒకప్పుడు మోసగాళ్లు ఇంటింటికీ తిరిగి నమ్మకం సంపాదించాల్సి వచ్చేది. ఇప్పుడు సోషల్ మీడియా ఆ పనిని సులభతరం చేసింది.

నకిలీ వెబ్‌సైట్లు, కృత్రిమ విజయగాథలు, ప్రముఖుల ఫోటోలు, ఫేక్ రివ్యూలు, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానెల్లు, యూట్యూబ్ ప్రకటనలు… ఇవన్నీ నమ్మకాన్ని అమ్మే సాధనాలుగా మారిపోయాయి. మొబైల్ స్క్రీన్‌పై కనిపించే ప్రతి అవకాశం నిజం కాదు. చాలా సందర్భాల్లో అది మోసానికి వేసిన అందమైన ముసుగు మాత్రమే.

### ఆర్థిక అక్షరాస్యత అవసరం

నేటి ప్రపంచంలో చదవడం, ఉద్యోగం చేయడం మాత్రమే సరిపోదు. డబ్బును ఎలా సంపాదించాలో తెలిసినంతగా, దాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా తెలుసుకోవాలి.



పెట్టుబడి పెట్టే ముందు ప్రతి ఒక్కరూ ఒక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి: అధిక లాభం అంటే అధిక ప్రమాదం. ప్రమాదం లేకుండా భారీ లాభాలు వస్తాయని చెప్పేవాడు వ్యాపారి కాదు, మోసగాడే అయ్యే అవకాశాలు ఎక్కువ.

ఏ పథకంలోనైనా పెట్టుబడి పెట్టే ముందు దాని చట్టబద్ధత, వ్యాపార నమూనా, లాభాల మూలం, నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించాలి. అర్థం కాని చోట డబ్బు పెట్టడం అంటే కళ్ళుమూసుకుని అగాధంలో అడుగు వేయడమే.

### గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు

శ్రమ లేకుండా వచ్చిన సంపద ఎక్కువకాలం నిలవదు.

అసాధారణ లాభాలు వస్తాయని చెప్పే ప్రతి అవకాశానికి వెనుక అసాధారణ ప్రమాదాలు కూడా దాగి ఉంటాయి.

లికేవలం “అందరూ పెట్టుబడి పెడుతున్నారు” కాబట్టి మనం కూడా పెట్టడం సరైన నిర్ణయం కాదు.

లి “నాకు తెలిసిన వ్యక్తి చెప్పాడు” అనే కారణం ఏ పెట్టుబడికైనా భద్రతకు హామీ ఇవ్వదు.

లిపెట్టుబడులు పెట్టే ముందు పూర్తిస్థాయిలో సమాచారం సేకరించడం, ప్రమాదాలను అంచనా వేయడం, వివేకంతో నిర్ణయం తీసుకోవడం అత్యంత అవసరం.

### మన డబ్బుకు మనమే కాపలాదారు

ప్రభుత్వాలు చట్టాలు చేయగలవు. పోలీసులు నేరస్తులను పట్టుకోగలరు. కోర్టులు శిక్షలు విధించగలవు. కానీ మోసపోయిన తర్వాత కోల్పోయిన డబ్బు, నమ్మకం, ప్రశాంతతను పూర్తిగా తిరిగి తీసుకురావడం చాలా కష్టం.

అందుకే ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి, ప్రతి పెట్టుబడిదారు గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే:

“అత్యాశ మొదలైన చోట వివేకం ఉండదు… వివేకం లేని చోటే మోసం ప్రారంభమవుతుంది.”

త్వరగా ధనవంతులు కావాలనే ఆరాటం కంటే, కష్టపడి ఎదగాలనే సహనం గొప్పది. ఎందుకంటే డబ్బు కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ జీవితకాల శ్రమతో కూడిన పొదుపులు కోల్పోతే ఆ గాయం చాలా కాలం మానదు.

అందుకే… అత్యాశను అదుపులో ఉంచండి. అవగాహనను పెంచుకోండి. వివేకంతో నిర్ణయాలు తీసుకోండి. మీ కష్టార్జిత సంపదను కాపాడుకోండి.

అత్యాశ మనిషిని ధనవంతుడిని చేయడం ఏమో కానీ క్షణాల్లో నిరుపేదను మాత్రం చేయగలదు.

**జి. అజయ్ కుమార్**

# వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 13(హైదరాబాద్ మిర్రర్ ):**

భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున సంస్థాన్ నారాయణపురం ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి తెలిపారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు, అకాల వర్షానికి కూలిపోయే ప్రమాదం ఉంది కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వార్డుల్లో విద్యుత్ స్తంభాలు గాలికి చెట్లు కూలిపోయినచో వార్డు మెంబర్లకు, గ్రామపంచాయతీ, సిబ్బందికి, తెలియజేయగలరు అన్నారు. తప్పనిసరి అయితే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లొద్దని సూచించారు.వృద్దులు, చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి సూచించారు.



మొదటిపేజీ తరువాయి

# తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

## కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

# లక్డారం దళిత రైతుల భూముల్లో ఎస్టీపీ ప్రతిపాదనపై ఆందోళన

- దళిత రైతులకు న్యాయం చేయాలి: మెట్టు శ్రీధర్
- తమ భూములు తమకే కావాలంటూ దళితుల ఆందోళన
- 60 ఏళ్లుగా సాగులో ఉన్న భూములపై ప్రాజెక్ట్ పెట్టడం సరికాదు
- అక్రమ తవ్వకాలతోనే ఇబ్బందులు.. ఇప్పుడు ఎస్టీపీపై నిరసన
- ప్రాజెక్ట్ విరమించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక
- గ్రామసభ లేకుండానే పనుల ప్రయత్నమా..?
- ఆమీన్పూర్ వ్యతిరేకత తర్వాత లక్డారంపై దృష్టి..?
- పర్యావరణ, ఆరోగ్య సమస్యలపై ఆందోళన
- ప్రాజెక్ట్ విరమించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం
- పరిహారం లేదా ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలి
- రైతులతో చర్చించి పరిష్కారం చూపాలని డిమాండ్
- లక్డారం రైతుల సమస్యలపై స్పందించాలన్న విజ్ఞప్తి
- భూమి హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 13:**


సంగారెడ్డి జిల్లా,పటాన్‌చెరు మండలం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం గ్రామంలో ప్రతిపాదిత సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంపై గ్రామస్తులు, ముఖ్యంగా దళిత రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 498 లోని సుమారు 21 ఎకరాల 31 గుంటల భూమిపై ప్రాజెక్ట్ చేపట్టేందుకు అధికారులు ప్రయత్ని స్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం నుండి గ్రామస్తులు నిరసన చేపట్టారు.తమ కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములను స్వాధీనం చేసుకోవడం అన్యాయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. గతంలో ఆమీన్పూర్ ప్రాంతంలో వ్యతిరేకత ఎదుర్కొన్న ప్రాజెక్టును ఇప్పుడు లక్డారం గ్రామ భూముల్లో అమలు చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే కంకర క్రషర్లు, కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలు, అక్రమ మట్టి, ఇసుక రవాణా కారణంగా కాలుష్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. వేలాది టిప్పర్ల




రాకపోకలతో రోడ్లు దెబ్బతిన్నాయని, దుమ్ము, ధూళి కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మరో కాలుష్యానికి దారితీసే ప్రాజెక్ట్‌ను గ్రామ సమీపంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి ఎస్టీపీ ప్రాజెక్టును వెంటనే విరమించుకోవాలని, లేకపోతే తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

### దళిత రైతులకు న్యాయం చేయాలి : మెట్టు శ్రీధర్

లక్డారం గ్రామ పరిధిలోని అస్సైన్డ్ భూములను సాగు చేస్తున్న దళిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత రైతులతో కలిసి భూములను సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు అవసరమే అయినప్పటికీ పేద రైతుల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వంటి ప్రజాప్రయోజన ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని,



అయితే భూములు కోల్పోతున్న రైతులకు చట్టబద్ధమైన న్యాయం, తగిన పరిహారం లేదా ప్రత్యామ్నాయ భూమి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రైతుల సమస్యలను అధికారులు పునఃసమీక్షించి, వారితో చర్చించి న్యాయబద్ధమైన



పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన దయాకర్ రెడ్డి

-దేవరకద్ర సీనియర్ నాయకుడు బల్సుపల్లి ఆది హనుమంత్ రెడ్డి

-దేవరకద్రలో ఘనంగా దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డి వర్ధంతి వేడుకలు

**దేవరకద్ర, జూన్ 13 ( హైదరాబాద్ మిర్రర్ ):**

మాట తప్పని, మడమ తిప్పని మహానేత దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి అని దేవరకద్ర మండల సీనియర్ నాయకుడు బల్సుపల్లి ఆది హనుమంత్ రెడ్డి అన్నారు. దేవరకద్రలో శనివారం దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి 3వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆది హనుమంత్ రెడ్డి మాట్లాడారు.తన చివరి శ్వాస వరకు కార్యకర్తల, అభిమానుల ప్రజల కోసం నిరంతరం కృషిచేసిన మహర్షి! ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన కుటుంబం, ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత దయాకర్ రెడ్డి గారికి దక్కిందన్నారు. చాలామందికి రాజకీయ ఓనమాలు ఆయన నేర్పించారన్నారు.నేటి రాజకీయాల్లో ఒకే ఒక్కడు ఈ ఉమ్మడి జిల్లాలో దయాకర్ రెడ్డి అని ఆయన అన్నారు. ఆయన చేసిన మేలు కొందరు మర్చిపోయారో! కానీ జిల్లాలో ప్రతి ఊరిలో ఏదో ఒక మూల ఆయన పేరు ఇప్పటికీ వినిపిస్తుంది అంటే ఆయన ఎవరికి ఎంత సహాయం చేశారో అర్థమవుతుంది అన్నారు.ఎంత చెప్పినా మీ గురించి అక్షరాలు సరిపోవు రాసే కలం ఇంకిపోతూనే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మేము మరువలేని మహనీయుడై, మరచి పోలేని జ్ఞాపకంగా మా మదిలో ఎప్పటికీ మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డి శాశ్వతంగా మా గుండెల్లో ఉండిపోతారని ఆది హనుమంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పూసల కులానికి డీఎన్‌టిగా అధికారిక గుర్తింపు

**ఆర్మూర్, ( హైదరాబాద్ మిర్రర్ ), జూన్ 13:-**

తెలంగాణ రాష్ట్ర పూసల సమాజం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న శుభవార్తను రాష్ట్ర ప్రభుత్వం జీవో రూపంలో విడుదల చేయడం ఆనందదాయకమని జిల్లా పూసల సంఘం అధ్యక్షులు రంగన్న అన్నారు. గతంలో బీసీ–డీలో ఉన్న పూసల కులం బీసీ–ఏ లోకి రావడం ఒక విజయమైతే, ఇప్పుడు డీ నోటిఫైడ్ ట్రైబ్స్ డి ఎన్ టి జాబితాలో అధికారికంగా చోటు దక్కడం మరో చారిత్రాత్మక విజయం.ఈ గుర్తింపు కోసం నిరంతరం కృషి చేసిన కేంద్ర డీఎన్‌టీ కమిషన్ బోర్డు కార్యదర్శి అప్పారావు కి, రాష్ట్ర ముఖ్యమంత్రి కి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కి, అప్పటి బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం కి ప్రత్యేక కృతజ్ఞతలు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పూసల కులం డీఎన్‌టీ కులమని ధృవీకరిస్తూ కేంద్రానికి పంపిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తింపు ప్రకటించింది.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎన్‌టీ కులాల జాబితాలో పూసల కులం ఉండటం ప్రతి పూసల బిడ్డకు గర్వకారణం. త్వరలోనే డీఎన్‌టీ సర్టిఫికెట్లు కూడా జారీ చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రకటించారు. ఈ విజయానికి తెలంగాణ రాష్ట్ర పూసల సంఘం, పూసల చైతన్య వేదిక, తెలంగాణ యువజన సంఘం, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కుల పెద్దలు, మహిళలు, యువత మరియు ప్రతి పూసల బంధువు అందించిన సహకారం అమూల్యం. తెలంగాణ రాష్ట్ర పూసల సంఘం సాధించిన ఈ విజయం పూసల సమాజం ఐక్యతకు, పట్టుదలకు నిదర్శనం అని జిల్లా అధ్యక్షులు రంగన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు బాబు, వినోద్ కుమార్, నరేష్, రవి, రమణ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# చలో భువనగిరి జూలై 5 సమరభేరి సభను విజయవంతం చేయండి

రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్,జిల్లా అధ్యక్షులు రవి నాయక్

**నారాయణఖేడ్ జూన్ 13 ( హైదరాబాద్ మిర్రర్ )**

చలో భువనగిరి -- జూలై 5 న సమరభేరి సభను విజయవంతం చేయాలని శనివారం రోజున సంగారెడ్డిలో, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో భువనగిరి సమరభేరి సభ సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ మాట్లాడుతూ..జూలై 5న భువనగిరిలో జరగనున్న సమరభేరి సభను విజయవంతం చేయడానికి ఈ నెల 14వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులను కలిసి ఆహ్వానిస్తామని తెలిపారు.ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి భువనగిరి సమరభేరి సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. బహుజన వర్గాల హక్కుల సాధన కోసం ఈ సభ ఒక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రేమలత, మైనారిటీ జిల్లా అధ్యక్షులు నవాజ్, మునిపల్లి మండల అధ్యక్షులు ఇసుబ్, రాయికోడ్ మండల అధ్యక్షులు అంజయ్య యాదవ్, సదాశివపేట మండల నాయకుడు శంకర్, నరేష్, తబరేజ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా సేవలో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలి - తపస్ డిమాండ్



**గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )**

సేవలో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణలు డిమాండ్ చేశారు.ఇటీవల జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనలకు అనుగుణంగా సేవలో ఉన్న ఉపాధ్యాయులకు సంబంధించి 2025 సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. దీనికి సంబంధించి దాఖలైన 65 పునఃసమీక్ష పిటిషన్లను కూడా కోర్టు తిరస్కరించినట్లు వారు పేర్కొన్నారు. అలాగే 2028 ఆగస్టు 31లోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హత సాధించాల్సినది తప్పనిసరి అని స్పష్టం చేయడంతో సేవ నుండి తొలగింపు వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో సుమారు 30,000 మంది సేవలో ఉన్న ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హత పొందాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు సార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు సిద్ధమవడం కొంత ఊరటనిచ్చినా, అది పూర్తి పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు.విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన తరువాత 01 ఏప్రిల్ 2010 నుండి నియామకాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హతను తప్పనిసరి చేసినప్పటికీ, అంతకుముందు నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఈ పరీక్ష అవసరం లేదని స్పష్టంగా పేర్కొనబడిందని వారు గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రస్తుతం వారికి కూడా ఈ పరీక్ష తప్పనిసరి చేయడం అన్యాయమని అభిప్రాయ పడ్డారు. గత 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు తమ సంబంధిత సబ్జెక్టుల్లో బోధన చేస్తుండగా, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో అన్ని సబ్జెక్టులు కలిపిన ప్రశ్నలు ఉండడం అన్యాయమని వారు విమర్శించారు. భాషా ఉపాధ్యాయులు సహా ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధనకు సంబంధం లేని అంశాలు చదివి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు.అదేవిధంగా జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి, రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలో దీక్ష వంటి ఆన్లైన్ శిక్షణల ద్వారా ఉపాధ్యాయులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష అవసరం లేనిదిగా భావిస్తున్నట్లు తపస్ స్పష్టం చేసింది. సేవలో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలన్న అంశంపై తపస్ గతంలోనూ అనేకసార్లు ప్రభుత్వానికి వినతులు అందజేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 01 ఏప్రిల్ 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇవ్వాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించేలా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఆర్ కే సెవెన్ గని పై కవితక్క బాయి బాట పోస్టర్ల ఆవిష్కరణ!

హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య

శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి

**గోదావరిఖని జూన్ 13 ( హైదరాబాద్ మిర్రర్ )**

శ్రీరాంపూర్ డివిజన్ లోని =ఖ -7 గని వద్ద హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన మరియు హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క బాయి బాట పోస్టర్లను హెచ్ఎంఎస్ నాయకులు శనివారం నాడు ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య పాల్గొని ప్రసంగించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన యు సి ,ఐ ఎన్ టి యు సి సంఘాలు పూర్తిగా విఫలమై చెందాయి. సింగరేణి సంస్థ పూర్తిగా రాజకీయ జోక్యంలో కోరికపోయింది. ట్రేడ్ యూనియన్ వ్యవస్థ లేకుండా చేయడానికి



కుట్రలు జరుగుతున్నాయి. ఇప్పటికే సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ¯

# బదిలీపై వెళ్తున్న ఏ ఈ ఓ నార్య నాయక్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానం

**( హైదరాబాద్ మిర్రర్ ) చిన్నంబావి జూన్ 13**

చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ క్లస్టర్‌లో ఎనిమిదేళ్లుగా సేవలందిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నార్య నాయక్ బదిలీపై వెళ్తుండగా రైతులు, సర్పంచ్ ఉప సర్పంచ్ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. పెద్దమారూర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నార్య నాయక్ రైతుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలను రైతులకు చేరవేయడంలో, పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు అవసరమైన సూచనలు అందించడంలో ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసి వ్యవసాయ రంగాభివృద్ధికి తోడ్పడ్డారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, కే. లక్ష్మయ్య, వార్డు సభ్యులు పురేందర్ నాయుడు, మాజీ సర్పంచ్ కల్వకోలు ఉషన్నయ్య, పరుశరాముడు, మాజీ వార్డు సభ్యుడు గడ్డం నరహరి, మద్దిలేటి నారాయణరావు, గొల్ల స్వామి, ములకలపల్లి నరసింహ, బోయ ఉత్తరయ్య, ముగి పెద్ద ఎల్లయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




# భక్తిశ్రద్ధలతో అధిక వాయనాల కార్యక్రమం

పెద్ద శంకరంపేటలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో ఘన నిర్వహణ

32 మంది బ్రాహ్మణ దంపతులకు అధిక వాయనాల సమర్పణ

వేదమంత్రాల నడుమ ఆశీర్వచనాలు, అన్నప్రసాద వితరణ

**పెద్ద శంకరంపేట:మే 13 ( హైదరాబాద్ మిర్రర్ ):**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో అధిక వాయనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా వాయనాలు సమర్పించారు.సంఘం అధ్యక్షురాలు రాగం అర్చన, ప్రధాన కార్యదర్శి సంధ్య, కోశాధికారి దాదిగారి వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 32 మంది బ్రాహ్మణ దంపతులకు అధిక వాయనాలు అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక బ్రాహ్మణులు రాయలగారి కృష్ణశర్మ, మహేష్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న బ్రాహ్మణ దంపతులు ఆర్యవైశ్య కుటుంబాలను ఆశీర్వదించారు.అనంతరం బ్రాహ్మణులతో పాటు ఆర్యవైశ్య సంఘ సభ్యులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగింది. ఆర్యవైశ్య మహిళలు, సంఘ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విగ్రహ ప్రతిష్టాపనకు సరోజ్ రెడ్డి ఆర్థిక సహకారం

**దేవరకద్ర, జూన్ 13 (హైదరాబాద్ మిర్రర్ ):**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం భట్టుపల్లిలో ఈ నెల 22, 23, 24 తేదీలలో జరగబోయే శివాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి శనివారం తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆరోజు గ్రామంలో శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సరోజ్ రెడ్డిని ఆహ్వానించారు. దీంతో ఈ దైవ కార్యక్రమానికి తన వంతు ఆర్థిక సహకారంగా రూ.51, 116 లను సరోజ్ రెడ్డి కార్యక్రమ నిర్వాహకులకు అందజేశారు.



# 'ఇస్రో'ను సందర్శించిన ఖని విద్యార్థి రిశ్విక్

చిన్న వయసులోనే అవార్డు కైవసం చేసుకున్న ఘనత రిశ్విక్

రిశ్విని అభినందించిన కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం

శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయ బృందం

**గోదావరిఖని జూన్ 13 ( హైదరాబాద్ మిర్రర్ )**

అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ నిర్వహించిన ప్రపంచ స్థాయి 'భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్'లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక తిలక్ నగర్ కు చెందిన రాకం శ్వేత–కిరణ్ దంపతుల కుమారుడు, స్థానిక కృష్ణవేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిశ్విక్ ఇస్రో సందర్శనకు ఎంపికై శుక్రవారం కర్ణాటక బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించాడు. ఈ సందర్భంగా శేషాద్రిపురంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో తన తల్లిదండ్రులు, తమ్ముడు అయాన్ష్ తో కలిసి పాల్గొన్న రిశ్విక్ ను కార్యక్రమ ముఖ్య అతిథి, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ నేషనల్ టాపర్ మెడల్ తో పాటు మెమెంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రిశ్విక్ మాట్లాడుతూ తనను ఇస్రో సందర్శనకు ఎంపిక చేసిన ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇస్రోలో శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల నిర్మాణం తదితర అంశాలపై విలువైన సమాచారాన్ని అందించారని పేర్కొన్నాడు. ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ సోమనాథ్‌ను ప్రత్యక్షంగా కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపాడు. ఇస్రో సందర్శనకు తనను ప్రోత్సహించిన కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తన తల్లిదండ్రులకు రిశ్విక్ కృతజ్ఞతలు తెలిపాడు.



# యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా

**నిజామాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

యూరియా యాప్ బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ధర్మోరా గ్రామంలోని వ్యవసాయ గిడ్డంగికి తాళం వేసి, గిడ్డంగి ముందు టెంట్ వేసుకుని 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని గిడ్డంగిలో యూరియా ఉన్నా యాప్ లో తమకు బుక్ కాకుండా ఇతర గ్రామాల్లోని రైతులకు బుక్ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయ అధికారి హరీష్ గిడ్డంగి కి వేసిన తాళం తీయాలని కోరగా రైతులు అందుకు అంగీకరించలేదు. తమ గ్రామంలో ఉన్న యూరియా సంచులు తమకే ఇవ్వాలని లేదంటే గిడ్డంగి తాళాలు తీసేదే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిర్యానీ తిన్న వైద్య విద్యార్థులకు అస్వస్థ

## ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు గుర్తింపు

**గోదావరిఖని,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

నగరంలోని సిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని నగరంలో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్) చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. అనంతరం సరదా గా 12 మంది కవిత థియేటర్ సమీపం లో ని ఓ హోటల్ లో విందు భోజనానికి వెళ్లి మండీ బిర్యానీ ఆరగించాచి తిరిగి ఎవరి రూమ్ లకు వారు వెళ్లి పోయారు. ఇందులో 12 మంది విద్యార్థులలో 11 మంది కి ఫుడ్ ఫాయిజన్ అయింది. దీంతో అందరికీ వాంతులు విరోచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని గోదావరిఖనికి లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే 8 మందికి తీవ్ర, ముగ్గురికి స్వల్పంగా అస్వస్థత కు లోనయినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం వారిని వైద్యుల సలహా మేరకు డిశ్చార్జ్ చేశారు. అయితే హోటళ్లలో నాణ్యతను పరిశీలంచాల్సిన అధికారులు ఇంత జరిగినా పత్తా లేకపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

# భారీ వర్షానికి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

## రాకపోకలకు తీవ్ర అంతరాయం

**నిజామాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

నిజామాబాద్ జిల్లా లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్డుపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన వివరాలను శనివారం రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ వెల్లడించారు. సాయంత్రం నుండి భారీగా ఈదురు గాలులు వీచాయి. దీంతో పాటు వర్షం కూడా పడడంతో నిజామాబాద్ మండల పరిధిలోని ఖానాపూర్ రోడ్డులో రాత్రి సమయంలో ఓ భారీ వృక్షం విరిగిపోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆ రోడ్డు వెంబడి రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపారు. అయితే రోడ్డుపై పడిన చెట్టును తొలగించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విషయం తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్లి రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టును పెట్రోలింగ్ సిబ్బంది రోడ్డుపై నుండి తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకల అంతరాయం తొలగిపోయింది

# గిరిజన సంప్రదాయాలపై పేపర్ ప్రజెంటేషన్

## రీసెర్స్ స్కాలర్ రాజేంద్రపప్రసాద్‌కు సన్మానం

**భద్రాద్రికొత్తగూడెం,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్వహించిన 'గిరిజన జీవితం, సాంప్రదాయాలు, గతానుభవాలు, అంతర్‌ద్రుష్టులు, దూరదృష్టి' అంశంపై ఈ 12, 13 తేదీల్లో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్, సమక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబ్బయ్య చారి హాజరయ్యారు. ఈ సెమినార్‌లో బూర్గంపహాడ్ మండల పరిధిలోని కోయగూడెంకు చెందిన ట్రైబల్ రీసెర్చ్ ఫెలో పాయం రాజేందప్రసాద్ పాల్గొని 'కోయ గిరిజనుల ప్రాచీన ఆహారపు అలవాట్లు' అంశంపై రాసిన వ్యాసాన్ని సమర్పించారు. ఈ సెమినార్‌లో ఆ వ్యాసం పలువురు ప్రముఖుల నుండి అభినందనలు అందుకోగా రాజేందప్రసాద్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

# ఆదర్శ రైతు సాయినికి ఉత్తమ రైతు అవార్డు

**భద్రాద్రికొత్తగూడెం,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదర్శ రైతు సాయిని మధుసూదన్ రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ విశ్వవిద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సాయిని మధుసూదన్ రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే 'రైతులకు నేస్తం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేయనున్న కొత్త వంగడాలు, చిరుధాన్య పంటల సాగు విధానాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను తన పొలంలో అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

# పాఠశాలల కుదింపునకు నిరసన

## 15న డైరెక్టరేట్ ఎదుట ధర్నాకు పిడిఎస్‌యు పిలుపు

**హనుమకొండ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల కుదింపునకు నిరసనగా ఈనెల 15న ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ముందుఏ మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఉన్న పాఠశాలలను కుదించడం అన్యాయమని అన్నారు. ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్లు, సరైనా బిల్డింగ్స్?, కనీస సమస్యలను ఏమాత్రం మెరుగుపరుచకుండా 4 వేల పాఠశాలలకు కుదించడం పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేయడమే నన్నారు. ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చి కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలను పెంచి పోషించుకుంటుందని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను రేవంత్ సర్కార్ నియంత్రించాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యంలో రైతు జీవితం

## మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్ర ఆవిష్కరణ

**నల్లగొండ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

తెలుగు సాహిత్యంలో రైతు జీవితాన్ని మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్రంగా ఆవిష్కరించారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమి, సృజన సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేరెడ్డి యాదగిరి రెడ్డి సాహిత్య సమాలోచన ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా నిబద్ధతతో అనేక పక్రియలలో మేరెడ్డి యాదగిరిరెడ్డి సాహిత్య సృజన చేశారని కొనియాడారు. ముఖ్యంగా కథా సాహిత్యంలో తెలంగాణ గ్రామీణ ప్లలెను గ్రామీణ జీవితాన్ని రైతుల జీవితాలను చక్కగా చిత్రించారన్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ.. మేరెడ్డి యాదగిరి రెడ్డి అట్టడుగు వర్గాల జీవితాలను సాహిత్య కాన్వాస్ పై ఆవిష్కరించారన్నారు. పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి మాట్లాడుతూ తెలుగు కథా సాహిత్యంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి తనదైన ముద్రవేశారన్నారు. నాలుగు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి కథలు రైతు జీవితం అనే అంశంపై ప్రసంగించారు. డా.పొట్టబత్తుల రామకృష్ణ మేరెడ్డి యాదగిరి రెడ్డి కవిత్వం అనే అంశంపై ప్రసంగించారు. డా.ఉప్పల పద్మ 'మేరెడ్డి యాదగిరిరెడ్డి బాలసాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ సి.అనిత కుమారి మేరెడ్డి మినీ కవిత్వం వస్తు శిల్పాలు అనే అంశంపై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పలువురు కవులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి

## పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ డిమాండ్

**భువనగిరి,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

భువనగిరి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు అన్ని పూర్తయిన నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని, నెల రోజుల్‌లో ప్రారంభించకుంటే వీధి వ్యాపారులతో ప్రారంభం చేయిస్తామని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి.కిరణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను శనివారం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏవి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారస్తులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను అన్ని వసతులతో నిర్మించడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం గడిచిపోయిన ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వీధి వ్యాపారులకు శాపంగా మారిందన్నారు. నిర్మించిన భవనంలోని ఎలక్ట్రిక్రల్ వైర్లు, ప్రహారికి నిర్మించిన గ్రిల్స్ ను కట్ చేసి దొంగలించిన వస్తువుల విలువ సుమారూ రూ.25 లక్షలని మున్సిపల్ కమిషనర్, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దర్యాప్తునకు నోటుకోలేదన్నారు. భువనగిరి ఎమ్మెల్యే అతడి క్యాంప్ కార్యాలయ ఆవరణలోనే ఉన్నా కూడా మార్కెట్‌ను పరిశీలించకపోవడం, దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తూ ఉంటే భువనగిరి పట్టణంపై అతనికి ఉన్న ప్రేమ నామ మాత్రమే అని పట్టణ ప్రజలకు అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల మనబడి-మనబాధ్యతలో బండి

## ఎస్పీ హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం

**రాజన్న సిరిసిల్ల,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి-మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

## భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం

## రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్

**చెన్నై,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**




తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీక్రి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ – సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు– కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ – సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్ళి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ – సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.

# అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

## తాళం పగులగొట్టి సోదాలు చేశారని టిఎంసి ఆరోపణ

**కోల్‌కతా,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు. భవానీపూర్‌లోని ఆయన నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి ఈడీ ఈ దాడులు జరిపినట్టు చెబుతున్నారు.

# మ్యాగీ నూడిల్స్‌లో పురుగులు సోషల్ మీడియా వార్తలను

## ఖండించిన నెస్లే

**న్యూఢిల్లీ,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):**

మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్చేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.

# 15న తెరుచుకోనున్న పాఠశాలలు

## స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

### వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేరొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రీమార్కులు తెలియజేయాలి. ప్రమాదాలు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

## విశ్రాంత ఉద్యోగిని

### భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ

సంగారెడ్డి,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధికారులుగా నటిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు సూచించారు.

# అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

## ఐదురుగు వైమానికి సిబ్బంది

### మృతిచెందినట్లు సమాచారం

గౌహతి,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

# ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో లింగనిర్ధారణ

## డెకాయ్ ఆపనరేషన్‌లో గుర్తించిన పోలీసులు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

వనస్థలిపురంలో లింగ నిర్ధరణ పరీక్షల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హయగ్రీవ ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఈ విషయం బయట పడింది. తొలుత మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపించారు. లింగనిర్ధరణ పరీక్షల గురించి ఆరా తీయగా.. చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్, రిసెప్షనిస్ట్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమెను తుక్కుగూడ ల్యాబ్ టెక్నీషియన్ వద్దకు రిఫర్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీసాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్‌కు చేరుకున్న పోలీసులు.. అక్కడ లింగ నిర్ధరణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హయగ్రీవ ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజు, లోకేశ్, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతికూల వాతావరణం

## శంషాబాద్ విమానాల దారి మళ్లింపు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, దిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

# పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

## 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్ధవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

## స్థానికుల ఆందోళన..

### కంపెనీ ముందు ధర్నా

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన కారు కిందే బాలుడు శివం పడిపోయాడు. తీవ్ర గాయాలయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కంపెనీ ఎదుట బైఠాయించి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. న్యాయం జరిగేలా చూస్తామంటూ పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

## అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

హ ఐదరాబాద్ జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో అ÷-దదె ఇంట్లో బంగ్లా జాతీయులు నివాసం ఉంటున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తించారు. ఇతర డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లోనూ బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు వీరిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిని మెదక్ జిల్లా జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. వీరిందరినీ తిరిగి వారి దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

## షబ్బీర్ అలీకి ఎఐసిసి షోకాజ్ నోటీస్

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# మహిళా పైలట్‌కు వేధింపులు: కేసు నమోదు

హైదరాబాద్,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఓ మహిళా పైలట్‌కు వేధింపుల ఘటన కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కల్ట్ జిమ్ ఫిట్‌నెస్ మేనేజర్ సంతోష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిమ్ ట్రైనింగ్ పేరుతో తనను లోబర్చుకునేందుకు ప్రయత్నించాడని, ఒప్పుకోకపోవడంతో ఇన్‌స్టాలో తనపై అసభ్య మెసేజ్‌లు పెట్టారని మహిళా పైలట్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మేనేజర్ సంతోష్‌గౌడ్‌కు అతని గర్ల్ ఫ్రెండ్ రజనీ సహకరించిందని పోలీసులకు తెలిపారు.

# 26న యాంటీ డ్రగ్ 3కే రన్

## కరపత్రాన్ని ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల,జూన్13( హైదరాబాద్ మిర్రర్ ):

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 న నిర్వహించనున్న 'యాంటీ డ్రగ్ 3కే రన్' కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రన్ స్ట్రాంగ్ లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు..డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చింది. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వద్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.



# ఓ సుకుమారి... టీజర్ విడుదల

తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ..! సుకుమారి'. భరత్‌దర్శన్ దర్శకుడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదలైంది. ఒక్క నిజం దాచి పెట్టి కథానాయకుడిగా పెళ్లి చేస్తే ఏం జరిగిందన్న ఆసక్తికర అంశానికి వినోదాన్ని జోడించి ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఝాన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు.




# కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

## - ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.






# హాలీవుడ్‌లో మైఖేల్ మూవీ చరిత్ర

## సుమారు రూ. 8,673 కోట్ల భారీ వసూళ్లు

పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టిచింది. ఇప్పటివరకు మ్యూజిక్ బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.




# ఓటిటిలోకి వచ్చిన దృశ్యం-3

మలయాళ చిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్ మోహన్ లాల్, సంచలన దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే వచ్చిన రెండు భాగాలు దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించగా.. ఇటీవల విడుదలైన మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'దృశ్యం 3' కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. అయితే థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్, విడుదలైన నెలలోపే ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో భారీ ధరకు కైవసం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, తెలుగు బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్రస్తుతానికి ఈ సినిమా కేవలం మలయాళం భాషలోనే స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల డబ్బింగ్ వెర్షన్ల విడుదలపై ఓటీటీ సంస్థ నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# మళయాళ క్రైమ్ థ్రిల్లర్ ధృడం




మలయాళంలో మంచి విజయాన్ని అందుకున్న 'దృధం' ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. జియో హాట్‌స్టార్ వేదికగా తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతున్నది. విజయ్ (షేన్ నిగమ్) శిక్షణ అనంతరం తొలిసారి కుజినీలం పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా వెళ్తాడు. ఆ ఊరు, ఆ ప్రాంతం శాంతిభద్రతలకు నెలవు. చాలా ప్రశాంతమైన వాతావరణం. స్టేషన్‌కు వెళ్లిన తర్వాత అందులో పనిచేస్తున్న పోలీసులందరూ ఎంతో స్నేహంగా ఉంటారు. డ్యూటీల విషయంలో ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ ఒక కుటుంబంలా కలిసి పనిచేస్తుంటారు. ఎస్సైగా విజయ్ బాధ్యతలు తీసుకున్న రెండు రోజులకే ఊరి చివరన గుర్తుపట్టలేని స్థితిలో శవం బయటపడుతుంది. కేసు నమోదు చేసి, విచారణ మొదలుపెట్టిన మరుసటి రోజే స్థానిక ÷నాన్స్ కంపెనీలో దోపిడీ జరుగుతుంది. 120 సవర్ల బంగారం, రూ.50లక్షల నగదు దోచేస్తారు. ప్రశాంతమైన ఊళ్లో ఇలా జరుగుతున్నాయేంటి? అనుకునేలోపే డ్యామ్ దగ్గర మరో శవం బయటపడుతుంది. దీంతో ఆ ఏరియా గురించి వార్తల్లో చర్చనీయాంశమవుతుంది. ఈ కేసులను పరిష్కరించాలని ఎస్సై విజయ్‌పై ఉన్నతాధి కారులు ఒత్తిడి తెస్తారు. ఎటు వెళ్లినా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో విజయ్ తలపట్టుకుని కూర్చొంటాడు. వారం రోజుల్లో కేసు పరిష్కరించకపోతే, ఆ బాధ్యతలు వేరొకరికి అప్పగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తారు. మరి ఆ శవాలు ఎవరివి? వాళ్లను ఎవరైనా హత్య చేశారా? ÷నాన్స్ కంపెనీలో దోపిడీ చేసిందెవరు? తదితర విషయాలను విజయ్ ఎలా కనిపెట్టాడు? ఈ క్రమంలో అతడికి ఎదురైన సవాళ్లు ఏంటి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రేక్షకులను కుర్చీ అంచున కూర్చోబెట్టి, అలరించడంలో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌లు ఎప్పుడూ ముందుంటాయి. అయితే, ఆ కథ.. విచారణ జరిగే తీరును తెరపై ఎలా ప్రజెంట్ చేశారన్న దానిపైనే మూవీ విజయం ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో 'దృధం' దర్శకుడు మార్టిన్ జోసెఫ్ మంచి మార్కులు కొట్టేశారు. ఇప్పటివరకూ చూసిన క్రైమ్ థ్రిల్లర్లకు పూర్తి భిన్నమైన క్లైమాక్స్ ట్విస్ట్‌తో దీనిని తీర్చిదిద్దారు. కొత్తగా ఎస్సైగా చేరిన ఓ యువకుడిని చుట్టుముట్టిన కేసులను ఎలా పరిష్కరించాడన్నది ఈ కథకు మూలమైనా, దాన్ని ఆద్యంతం ఉత్కంఠ కలిగించేలా తీర్చిదిద్దారు. విజయ్ వ్యక్తిత్వం, ప్రశాంతమైన కుజినీల ప్రాంతం, అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సహచరుల స్నేహభావం తదితర సన్నివేశాలతో కథా ప్రపంచాన్ని ప్రేక్షకుడికి పరిచేయం చేసిన దర్శకుడు.. మొదటి శవం బయటపడగానే అసలు కథను పట్టాలెక్కించాడు. ఫైనాన్స్ కంపెనీతో దోపిడీ ఘటనతో కథలో వేగం పెంచాడు. ఇక్కడి నుంచి మొదలయ్యే ఇన్వెస్టిగేషన్, ఆధారాల కోసం విజయ్ అండ్ టీమ్ చేసే ప్రయత్నాలు కాస్త రొటీన్‌గానే అనిపిస్తాయి. ఒకవైపు ఇన్వెస్టిగేషన్ సాగుతున్నా, మరోవైపు కొత్త తలనొప్పులు విజయ్‌ను చుట్టుముట్టే సన్నివేశాలు చూస్తుంటే, కథానాయకుడు వీటిని ఎలా అధిగమిస్తాడన్న ఆసక్తి ప్రేక్షకుడిలో కలుగుతుంది. హంతకుడు ఎవరో పట్టుకునే క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు మరింత ఉత్కంఠ కలిగిస్తాయి. రెప్పపాటులో హంతకుడిని తప్పించి, ద్వితీయార్థంపై ఆసక్తిని కలిగించాడు దర్శకుడు. తన మొదటి కేసును ఎలాగైనా విచారణ చేయాలన్న 'దృఢ' సంకల్పంతో తప్పు ఎక్కడ జరుగుతుందో విజయ్ వెతుక్కుంటూ వెళ్లే క్రమం మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ÷వరి 20 నిమిషాల్లో సాగే యాక్షన్, నిందితులపై విజయ్ చేసే పోరాటం అలరిస్తాయి.



# 80 ఏళ్ల వయసులోనూ అమితాబ్ సరికొత్త రికార్డు

## ఏకబిగిన 12 లఘుచిత్రాల షూట్

వయసు కేవలం ఓ సంఖ్య మాత్రమే.. పనిపై ఆసక్తి ఉంటే అలుపనేదే రాదని మరోసారి నిరూపించారు బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్. ఎనభై ఏళ్లు దాటినా కుర్ర హీరోలకు ఏమాత్రం తీసిపోని ఎనర్జీతో ఒకేరోజు ఏకంగా 12 లఘు చిత్రాల షూటింగ్ పూర్తిచేసి అందరినీ అవాక్కయ్యేలా చేశారు. ఈ విషయాన్ని ఆయన తన బ్లాగ్ పోస్ట్‌లో వెల్లడించారు. 'పని అంటే పనే.. ఈ రోజు 12 లఘు చిత్రాల షూటింగ్, 2 స్టిల్ షూట్‌లు పూర్తయ్యాయి. ఆ పనులన్నీ సాగుతూనే ఉంటాయి. కానీ, మీతో ఈ విషయాలు పంచుకోవడం ఆగదు' అని ఆయన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. 'శ్రద్ధగా అధ్యయనం చేయడం.. పరిస్థితులకు రాజీ పడకపోవడం.. ఏసీ గదుల్లో సౌకర్యవంతమైన దుస్తులు ధరించినప్పటికీ పనిపై అంకితభావం తగ్గకపోవడం' అనే క్యాప్షన్‌తో బ్లాగ్‌లో ఆయన ఫొటోలు పంచుకున్నారు.



# హిట్ అండ్ రన్ ..క్రైమ్ థ్రిల్లర్

సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాను సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. త్వరలోనే మేకర్స్ 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటికే మోడల్‌గా రాణిస్తూ, పలు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తున్న నటాషా సింగ్ తెలుగులో 'హైలెస్సో' మూవీలోనూ యాక్ట్ చేస్తోంది. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో నటాషాతో పాటు నక్ష శరణ్ హీరోయిన్ నటిస్తోంది.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889